క్లుప్తంగా

అభివృద్ధిపై రాజీపడేదిలేదు



మాట్లాడుతున్న పాడి కౌశిక్‌రెడ్డి

వీణవంక: అభివృద్ధి విషయంలో రాజీపడే ప్రసక్తి లేదని, రైతు సంక్షేమమే సీఎం కేసీఆర్ ధ్యేయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని రైతువేదిక వద్ద ఏర్పాటు చేయనున్న బోరువెల్, అదేవిధంగా కబ్రస్తాన్‌ను పనులను పరిశీలించారు. తెలంగాణ ఏర్పడిన గ్రామాలు సస్యశ్యామలంగా మారాయని, సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. వ్యవసాయ అధికారి గణేశ్‌పై కౌశిక్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతువేదిక ఇలానే ఉంటుందా అని మండిపడ్డారు. రోజూ ఆఫీస్‌కు వస్తే అపరిశుభ్రంగా ఎందుకుంటుందని, పంట నష్టం సర్వే ఎందుకు కాలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ముసిపట్ల రేణుక, వైస్ ఎంపీపీ రాయిశెట్టి లత, సర్పంచ్ నీల కుమారస్వామి, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ నరహరి తిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు ఓరెం క్రాంతి, మధు, నీల పున్నం చందర్ ఉన్నారు.

25వ వార్డులో కంటి వెలుగు శిబిరం



ఇల్లందకుంట: శిబిరాన్ని ప్రారంభిస్తున్న లలిత

హుజూరాబాద్: పట్టణంలోని 25వ వార్డులో మంగళవారం రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక, వైస్ చైర్ పర్సన్ కొలిపాక నిర్మల, కౌన్సిలర్లు కిషన్, యాదగిరి నాయక్, నాయకులు వర్దినేని రవీందర్‌రావు తదితరులు ఉన్నారు.

ఇల్లందకుంట: మండలంలోని గడ్డివానిపల్లి గ్రామంలో మంగళవారం కంటివెలుగు శిబిరాన్ని సర్పంచ్ చెవుల లలిత ప్రారంభించారు. అనంతరం ఇల్లందకుంట పీహెచ్‌సీ వైద్యాధికారి తులసిదాస్ మాట్లాడుతూ.. కంటివెలుగు ప్రాధాన్యత గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ తెడ్ల ఓదెలు, డాక్టర్ నాగలక్ష్మి, హెల్త్‌ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, ఆప్తాలమిస్ట్ రాజు, డీఈవో రవికిరణ్, హెల్త్ అసిస్టెంట్ రవీంద్రనాథ్, రాజశ్రీ అరుణ, భాగ్యలక్ష్మి, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నియామకం



మాట్లాడుతున్న నాబార్డు ఏజీఎం అనంత్

రామడుగు: మండలంలోని తిర్మలాపూర్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ లిమిటెడ్ నూతన చైర్మన్‌గా పిండి రాజిరెడ్డిని కంపెనీ డైరెక్టర్లు నియమించారు. మంగళవారం చైర్మన్‌గా రాజిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

సమీక్ష సమావేశం

తిర్మలాపూర్ గ్రామ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ డైరెక్టర్స్‌తో నాబార్డు ఏజీఎం అనంత్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కంపెనీ నిర్వహణ, సభ్యత్వాల సేకరణ, వ్యాపారంపై చర్చించారు. డైరెక్టర్లు కంపెనీ అభివృద్ధికి కష్టపడి పనిచేయాలని సూచించారు. కంపెనీ చైర్మన్ రాజిరెడ్డి, సీఎస్‌ఏ ప్రతినిధులు, మోహన్‌రెడ్డి, హరీశ్, శ్రీనివాస్, కట్ల శ్రీనివాస్, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

16న 'మోడల్' ప్రవేశ పరీక్ష

తిమ్మాపూర్: మోడల్ స్కూళ్లలో 6వ తరగతిలో అన్ని సీట్లు, 7, 8, 9, 10వ తరగతుల్లో మిగిలిన సీట్లకు ఈ నెల 16న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని తిమ్మాపూర్ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ పద్మ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా హాల్‌టికెట్ డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షకు హాజరుకావాలని సూచించారు. 6వ తరగతిలో ప్రవేశానికి ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, 7, 8, 9, 10వ తరగతిలో ప్రవేశానికి మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రానికి రావాలని సూచించారు.

జ్యోతిబాపూలేకు నివాళి

చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల్లో మంగళవారం సంఘ సంస్కర్త, మేధావి, కులనిర్మూలన పోరాట వీరుడిగా గుర్తింపు పొందిన మహాత్మా జ్యోతిబాపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటం, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. వెనుకబడిన వర్గాల కోసం విశేషంగా కృషి చేశారని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం పూలే పేరుమీద గురుకుల విద్యాలయాలు ఏర్పాటు చేసిందన్నారు. యువత పూలే అడుగు జాడల్లో నడవాలని సూచించారు. జయంతి వేడుకల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు. - సాక్షి నెట్‌వర్క్



చొప్పదండి: నివాళి అర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ



జమ్మికుంటలో మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావు, నాయకులు



హుజూరాబాద్‌లో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, నాయకులు



మానకొండూర్: కొండపలకలలో నివాళి అర్పిస్తున్న బీఎస్పీ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి నిషాని రామచంద్రం



తిమ్మాపూర్: రామకృష్ణకాలనీలో ఓబీసీ మండలశాఖ ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు



చిగురుమామిడి: ఉల్లంపల్లిలో విగ్రహాలకు నివాళి అర్పిస్తున్న ఎంపీపీ కొత్త వినీత, జెడ్పీటీసీ గీకురు రవీందర్, తదితరులు

కలగానే 'కల్వల' ప్రాజెక్టు

- వీణవంకలో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని పలు సమస్యలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



కల్వల చెరువు

వీణవంక: మండలంలో పలు సమస్యలు ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోవడం లేదు. ముఖ్యంగా కల్వల చెరువును ప్రాజెక్టుగా మారుస్తామన్న ప్రతిపాదనలు అటకెక్కాయి. చెరువు కింద 8వేల ఎకరాల భూమి సాగవుతోంది. 35ఏళ్లుగా మండలంలోని ప్రజలు ప్రాజెక్టుగా మార్చాలని కోరుతున్నారు. కానీ సమస్య ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉంది. చెరువు దిగువన వీణవంక, రెడ్డిపల్లి, రామక్రిష్టాపూర్, లస్మక్కపల్లి, పోతిరెడ్డిపల్లి గ్రామాలకు తాగు, సాగుకు చెరువు నీరే దిక్కు. దీని పరిధిలో ఐదు చెక్‌డ్యాంలు నిర్మించారు. గతంలో కురిసిన వర్షాలకు చెక్‌డ్యాంలకు లీకేజీలు ఏర్పడ్డాయి. లీకేజీల సమస్య పరిష్కారం కావడంలేదనే విమర్శ ఉంది. మండలంలో 26 గ్రామ పంచాయతీలు ఉండగా 56వేల జనాభా ఉంది. సుమారు 36 వేల ఎకరాల భూమి సాగుకు అనుకూలంగా ఉంది.

- మండలంలోని బొంతుపల్లి గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలు ఉన్నాయి. కానీ సమస్య ఏళ్లుగా సాగుతోంది.
- వీణవంకలో గ్రంథాలయానికి రెండేళ్ల క్రితం నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించినా ఇప్పటివరకు పూర్తి కాలేదు. దీంతో పాఠకులకు లైబ్రరీ అందని ద్రాక్షగానే మారింది.
- వీణవంకలో ఏదైనా సమావేశం ఏర్పాటు చేసుకోవాలంటే కనీసం కమ్యూనిటీ హాల్ లేకుండా పోయింది. పాలకులు కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామని ఇచ్చిన హామీ ఇప్పటివరకు నెరవేరలేదు.
- బేతిగల్ గ్రామంలోని ఎస్సీ కాలనీ నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు సీసీరోడ్డు వేయాలని రైతులు గతంలో పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదు. వర్షాలు పడితే నడవడానికే ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది.
- వీణవంకలో ఆరు చెక్‌డ్యాంలు నిర్మించిన వర్షాలకు అన్నీ చెక్‌డ్యాంలకు లీకేజీలు ఏర్పాడ్డాయి. వీటిని పూడ్చాలని రెండేళ్లుగా రైతులు కోరుతున్న పట్టించుకునే నాథుడే లేడు.
- ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రాజెక్టుగా మార్చాలి

కల్వల చెరువును అభివృద్ధి చేయాలి. చెరువును ప్రాజెక్టుగా మారిస్తే పంటలకు ఢోకా ఉండదు. చెరువు కింద మల్లన్నపల్లి, బ్రాహ్మణపల్లి, వీణవంక, రెడ్డిపల్లి, రామక్రిష్టాపూర్, లస్మక్కపల్లి, పోతిరెడ్డిపల్లి గ్రామాలకు తాగు, సాగుకు చెరువే నీరే దిక్కు. ప్రాజెక్టు మార్చాలని ఎన్నో ఏళ్లుగా కొట్లాడుతున్నా ఫలితం లేదు కాదు. చెక్‌డ్యాంలకు లీకేజీలు ఏర్పడ్డాయి పూడ్చకపోతే చుక్క నీరు ఉండదు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించాలి.
– శ్రీనివాస్‌రెడ్డి, వీణవంక

రాజాపూర్‌లో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రసమయి

శంకరపట్నం: మండలంలోని రాజాపూర్ గ్రామంలో మంగళవారం ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. వివిధ గ్రామాల్లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కేశవపట్నం గ్రామంలో అరుంధతి కల్యాణమండపం నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో మహాత్మా జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ రమేశ్, విండో చైర్మన్ తిరుపతిరెడ్డి, మధుకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్, అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

మండలంలోని ఇప్పలపల్లి ఉపసర్పంచ్ వెంగల శ్రీనివాస్ ఎమ్మెల్యే సమక్షంలో మంగళవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. మండలంలోని కేశవపట్నంలో శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ... అభివృద్ధి పనులు చూసి పార్టీలో చేరానని తెలిపారు.

దళితరత్న అవార్డు గ్రహీతలకు సన్మానం

తిమ్మాపూర్: హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఇటీవల దళితరత్న అవార్డులు అందుకున్నవారిని ఎమ్మెల్యే మంగళవారం సన్మానించారు. అవార్డు అందుకున్నవారిలో తిమ్మాపూర్ మండలం మొగిలిపాలెం గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు ఎల్కపల్లి కుమార్, పర్లపల్లి గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాటిపల్లి బాబు, కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలిపెల్లి వెంకన్న ఉన్నారు.

ప్రశాంతంగా ముగిసిన పదోతరగతి పరీక్షలు

హుజూరాబాద్: హుజురాబాద్ పట్టణం, మండల వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 200 మందికి 199, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 178 మందికి 178, న్యూ శాతవాహనలో 163 మందికి 163, మాంటిస్సోరి పాఠశాలలో 158 మందికి 156, చెల్పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 200 మందికి 199 విద్యార్థులు హాజరయ్యారని ఎంఈవో కేతిరి వెంకట నర్సింహా రెడ్డి తెలిపారు.

అర్హులందరికీ సహాయ ఉపకరణాలు



దివ్యాంగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

చొప్పదండి: అర్హులైన దివ్యాంగులందరికీ సహాయ ఉపకరణాలు అందిస్తామని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ, అలీమ్ కో సంస్థ సహకారంతో దివ్యాంగులకు సహాయ ఉపకరణాలు అందించేందుకు దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో చొప్పదండి పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎంపిక శిబిరాన్ని ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. శిబిరానికి పెద్ద ఎత్తున వికలాంగులు హాజరై దరఖాస్తులు అందించారు. అర్హతను బట్టి లబ్ధిదారులను ఎంపిక చేస్తామని ఎంపికైన వారికి ఉపకరణాలు అందించేందుకు మరో క్యాంపు ఏర్పాటు చేస్తామని జిల్లా సంక్షేమ అధికారి బబిత తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో ప్రియాంక, మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, ఎంపీపీ చిలుక రవీందర్, జెడ్పీటీసీ మాచర్ల సౌజన్య, ఎంపీడీవో స్వరూప, సీడీపీవో కస్తూరి, వెంకటయ్య, అలీ, ప్రశాంత్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతి సభను విజయవంతం చేయాలి

గంగాధర: హైదరాబాద్‌లో 14న నిర్వహించే అంబేడ్కర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం తరుపున ఏర్పాట్లు చూసుకోవాల్సిన బాధ్యత అధికారులదేనని, నియోజకవర్గం నుంచి ప్రజలు తరలి వెళ్లడానికి బస్సు సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. అధికారులు, పార్టీ నాయకులు సమన్వయంతో వెళ్లాలన్నారు. సమావేశంలో డీఆర్డీవో పీడీ శ్రీలత, సీఐలు రవీందర్, రమణామూర్తి, ఆరు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎస్సైలు పాల్గొన్నారు.

యువత అధైర్యపడొద్దు



చొప్పదండి: టీ సేవ్ లోగో ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

గంగాధర: ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేయకపోవడంపై యువకులు అధైర్యపడి ఆత్మహత్యలకు పాల్పడొద్దని వైఎస్సార్‌టీపీ నాయకుడు తడగొండ సత్యరాజ్‌వర్మ అన్నారు. మండలంలోని మధురానగర్‌లో మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో టీ సేవ్ లోగో ఆవిష్కరించారు. పోరాటాలతో సాధించుకున్న తెలంగాణలో ఉద్యోగాలు రాక యువత ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. యువత కోసం తెలంగాణ సేవ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. నిరుద్యోగులకు పార్టీ అండగా ఉంటుందని ఉద్యోగాలు భర్తీ చేసే వరకు ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు స్రవంతి, శాస్త్రి, అంజయ్య, రాజేశ్, పెరిక మల్లయ్య, పాదం శంకరయ్య, విజయ్, వెంకటేశ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి: పట్టణంలో వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అక్కెనపల్లి కుమార్ మంగళవారం టీ సేవ్ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వరాల శ్రీనివాస్, వూకంటి రవిందర్ రెడ్డి, కొమ్ము అంజనేయులు, రొడ్డవేని తిరుపతి, బుర్ర శ్రీను, సంతోశ్, రాజు, రత్నం, రాములు, కుమార్, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై ధాన్యం ఆరబోస్తే చర్యలు

జమ్మికుంట: రోడ్లపై ధాన్యం ఆరబోస్తే చర్యలు తీసుకుంటామని జమ్మికుంట టౌన్ సీఐ బొర్పటి రమేశ్ అన్నారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో మండల పరిధిలోని ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. వరి, మొక్కజొన్న రోడ్డుపై పోస్తుండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయంతోపాటు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో, కల్లాల వద్ద ధాన్యం ఆరబెట్టుకోవాలన్నారు. రైతులకు అవగాహన కల్పించి రోడ్లపై ధాన్యం పోయకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై యూనీస్‌అహ్మద్, ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై దృష్టి సారించాలి



కెనాల్‌ను పరిశీలిస్తున్న గరిమాఅగర్వాల్

చొప్పదండి: నర్సరీల్లో మొక్కల పెంపకంపై దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ అన్నారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఎస్సారెస్పీ కెనాల్, దోభీఘాట్, నర్సరీలను పరిశీలించారు. ఎస్సారెస్పీ కెనాల్ సమీపంలో టీయూఎఫ్‌ఐడీసీ నిధులతో దోభీఘాట్ పనులు నిర్వహిస్తున్నామని, పట్టణంలో సెంట్రల్ లైటింగ్, రోడ్డు విస్తరణ, రోడ్డుకు ఇరువైపులా చెట్ల తొలగింపు, విద్యుత్ పనులపై సంబంధిత కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, కమిషనర్ శాంతికుమార్, తహసీల్దార్ అంబటి రజిత, ఏఈ నరసింహ, భూమయ్య, మల్లేశం, కృష్ణ, గంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

గన్నేరువరం: మండలంలోని మైలారం మైసమ్మ గుట్ట నుంచి కరీంనగర్‌లోని శ్మశానవాటిక వరకు లోయర్ మానేరు డ్యాంపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరుతూ బ్రిడ్జి జేఏసీ చైర్మన్ సంపతి ఉదయ్ ఆధ్వర్యంలో డ్యాం సమీపంలో మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎల్‌ఎండీ నిర్మించి 40 ఏళ్లు అవుతోందని, అప్పటి నుంచి దూరభారం పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. డ్యాం నిర్మాణంతో మండలానికి తీవ్ర నష్టం జరిగిందని, బ్రిడ్జి నిర్మాణంతో అభివృద్ధి చెందుతుందన్నారు. ఎంపీ బండి సంజయ్‌కుమార్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బ్రిడ్జి నిర్మాణానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. డ్యాం నిర్మాణ సమయంలో అప్పటి పాలకులు సైతం హామీ ఇచ్చారని పేర్కొన్నారు. వెంట జేఏసీ వైస్ చైర్మన్ పుల్లెల జగన్, జక్కనపల్లి సత్తయ్య, సంపతి రాములు, కరుణాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆమరణ నిరాహార దీక్ష



ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న సత్యనారాయణ

చొప్పదండి: అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టణంలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పట్టణానికి చెందిన చిలుకనూరి సత్యనారాయణ మంగళవారం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. కుడి చెరువులో నీరు నింపేందుకు ఎస్సారెస్పీ కాలువకు తూం ఏర్పాటు చేసి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. బాలుర ఉన్నత పాఠశాల స్థలం అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని, పీహెచ్‌సీని యాభై పడకల ఆసుపత్రి గా ఏర్పాటు చేయాలని కోరారు. మరికొన్ని డిమాండ్లతో ఫ్లెక్సీ ఏర్పాటు చేసి చొప్పదండి పోలీస్ స్టేషన్‌కు వెళ్లే దారికి ఎదురుగా ఉన్న రేకుల షెడ్డులో దీక్ష చేపట్టగా పలువురు ఆయనకు సంఘీభావం ప్రకటించారు.

హిందూ వ్యతిరేక పోస్టులను తిప్పికొట్టాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న పొన్నం శ్రీనివాస్

చిగురుమామిడి: సామాజిక మాధ్యమాల్లో హిందువుల మనోభావాలను దెబ్బతీసే, హిందూ వ్యతిరేక వార్తలను తిప్పికొట్టాలని డిజిటల్ హిందూ ఎన్‌క్లేవ్ ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ పొన్నం శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో హిందూ వ్యతిరేక వార్తలను ధీటుగా ఎలా ఎదుర్కోవాలి అనేదానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. 13న ఎల్కతుర్తి మండలంలోని శ్రీసత్యసాయి గార్డెన్స్‌లో నిర్వహించే అవగాహన కార్యక్రమానికి మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్‌రావ్, నేషనల్ హబ్ ఎడిటర్ అండ్ ఛీఫ్ సాయికృష్ణ, జర్నలిస్ట్ దేవికారెడ్డి, బీజేపీ హుస్నాబాద్ ఇన్‌చార్జి చాడ శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు.

ఆధ్యాత్మికం వెండి బహూకరణ



వెండి బహూకరిస్తున్న దాతలు

జమ్మికుంట: మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంట గ్రామంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయంలో దాతలు వెండి బహూకరించారని ఆలయ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి ఆకుల రాజేందర్ తెలిపారు. పట్టణానికి చెందిన పెరుమడ్ల అనసూయ సుదర్శన్‌గౌడ్ దంపతుల కుమారుడు ప్రశాంత్‌గౌడ్ స్వామివారికి వెండి తొడుగుల నిమిత్తం అరకిలో వెండి బహూకరించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ వేద పండితులు ప్రవీణ్‌కుమార్ ఆచార్యులు, నరేందర్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు భాస్కర్, తిరుపతి, మధుకర్, మహేందర్, పద్మ, గణేశ్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

మండలంలోని మాచనపల్లి గ్రామంలో పోచమ్మతల్లి గుడి నిర్మాణానికి దాతలు విరాళం అందజేశారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దాతలు పర్లపల్లి సమ్మయ్య రూ.20,116, పర్లపల్లి ఐలయ్య రూ.10,116 అందజేశారని, దాతలు ఆలయ నిర్మాణానికి ఆర్థిక సాయం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తిరుపతిరెడ్డి, రాజమల్లు, తిరుపతి, రమేష్, నాగరాజు, రాజు, శ్రీనివాస్, కుమారస్వామి, అశోక్, భిక్షపతి, సతీష్ గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థి శశాంక్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స కోసం కిట్స్ సైబర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు రూ.55 వేలు అందజేశారని ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శంకర్ తెలిపారు. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ అధిపతి కెప్టెన్ రవీంద్రబాబు, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్సీ అండ్ మిషిన్ లెర్నింగ్ అధిపతి డా. కె. ప్రవీణ్‌కుమార్‌రావు పాల్గొన్నారు.